ప్రజాశక్తి

మంగళవారం 5 ఆగస్టు 2025

5

పార్వతీపురం మన్యం

పార్వతీపురం, పాలకొండ సబ్‌కలెక్టర్లుగా వైశాలి, స్వప్నీ జగన్నాథ్

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వపురం, పాలకొండ సబ్ కలెక్టర్లుగా వైశాలి, స్వప్నీ జగన్నాథ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఈ రెండు డివిజన్లలో సబ్‌కలెక్టర్లుగా పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు అశుతోష్‌కుమార్ శ్రీవాత్సవ, సి.యశ్వంత్‌కుమార్ గత కొంత కాలంగా అదనపు బాధ్యతలు స్వీకరిస్తున్నారు. ఎట్టకేలకు వీరి నియామకంతో ఈ పోస్టులను భర్తీ అయ్యాయి. దీంతో పిఒలిద్దరూ ఇకపై పూర్తిస్థాయిలో తమ బాధ్యతలకు పరిమితమవుతారు.

కాటేసిన మృత్యువు

- రైలు ఎక్కించేందుకు వెళ్తూ లారీ ఢీకొని ముగ్గురు దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు అన్నదమ్ములు
- కొరిశిలలో అలముకున్న విషాదం

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- కొమరాడ

ఉపాధి కోసం విజయవాడ వెళ్తున్న తమ సోదరుడిని రైలు ఎక్కించేందుకు వెళ్తున్న వారిని మార్గమధ్యంలో మృత్యువు లారీ రూపంలో కాటేసింది. బాగా చదువు కొని ఏదో ఒక పని చేసుకుని కుటుంబాన్ని పోషించాలనుకున్న ఆ గిరిజన యువకుల కలలన్నీ కలగానే మిగిలిపోయాయి. ఉపాధి కోసం ఒకరు హైదరాబాద్ వెళ్లేందుకు బయలుదేరగా అన్నయ్యను రైలు ఎక్కించి సరదాగా సాగనంపడానికి తమ్ముడు, బావ స్కూటీపై వెళ్తుండగా లారీ ఢీకొనడంతో ముగ్గురూ కన్నుమూశారు. ఈ ఘటనతో కొరిశిలలో విషాదం అలముకుంది.

కొమరాడ మండలంలోని గిరిజన గ్రామమైన కొరిశిల గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు సిగురు కార్తీక్ (21), సిగురు ఉదయ్ కిరణ్ (19), దువ్వాడ జగన్ (17) సోమవారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. హైదరాబాదులో పనిచేస్తున్న కార్తీక్‌ను రాయగడ నుంచి గుంటూరు వెళ్లే రైలుకు గుమడ రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కించేందుకు తమ గ్రామం నుంచి స్కూటీపై బయలుదేరారు. కేరడ వద్ద ఉన్న వంతెన పైనుంచి నాగావళి నది దాటుకొని కూనేరు నుంచి గుమడ రైల్వే స్టేషన్‌కు వస్తుండగా, కొమరాడ పోలీసుస్టేషన్ సమీపాన రాయగడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ వీరి స్కూటీని ఢీకొంది. ఈ ఘటనలో వారి శరీర భాగాలు నుజునుజ్జయి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. లారీ డ్రైవర్ కనీసం ప్రమాదం జరిగిన తీరును చూసి కూడా ఆపకుండా నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించడంతో పోలీసుల సమాచారంతో పార్వతీపురం సమీపంలో అదుపులోకి తీసుకున్నారు.

జగన్ ఇంటర్ మొదటి సంవత్సరం కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఉదయకిరణ్ డిగ్రీ మొదటి సంవత్సరం పార్వతీపురంలో చదువుతున్నారు. కార్తీక్ ఐటిఐ పూర్తి చేసి కుటుంబ ఇబ్బందులు కారణంగా హైదరాబాద్‌లోని ప్రైవేటుగా ఉద్యోగం చేస్తున్నాడు. సిగురు కార్తీక్, ఉదయ్ కిరణ్ ఇద్దరూ అన్నదమ్ములు. వీరి తల్లి ఇటీవల మృతి చెందడంతో తండ్రి పురపాలు వివిధ పనుల కోసం ఒడిశా రాష్ట్రం వెళ్తుంటారు. ఏదో ఒక ఉద్యోగం చేసుకొని తమ్ముడు ఉదయ్ కిరణ్‌ను చదివించే బాధ్యత తీసుకున్న కార్తీక్ పార్వతీపురంలో ఐటిఐ పూర్తిచేసుకుని హైదరాబాదులో పని చేస్తున్నాడు. కొద్దిరోజుల స్వగ్రామానికి వచ్చిన కార్తీక్ తిరిగి ప్రయాణం అయ్యేందుకు సిద్ధమయ్యాడు. కార్తీక్‌ను రైలు ఎక్కించి వస్తామని ఇంటి వద్దచెప్పి సోదరుడు ఉదయ్‌కిరణ్, బావ వరుస అయిన జగన్ బయలుదేరారు. అంతలోనే వారు మృతి చెందారని తెలియడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. దువ్వాడ జగన్ తల్లిదండ్రులు కృష్ణ, చిన్నాలు గ్రామంలోని చిన్నచిన్న కూలి పనులు చేసుకుంటూ కొడుకును బాగా చదివించి మంచి ఉద్యోగానికి పంపించాలని కలలు గన్నారు. రహదారిపై విగత జీవిగా పడి ఉన్న మృతదేహాన్ని చూసి ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మరోవైపు ఇద్దరు కొడుకులనూ కోల్పోయి కార్తీక్, ఉదయ్‌కిరణ్ తండ్రి పురపాలు రోదన చూసిన వారి హృదయాలను కలచివేసింది.

పనిచేయని ఫోన్లు మాకొద్దు

- ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ధర్నా
- సిడిపిఒలకు సెల్‌ఫోన్లు అప్పగింత

ప్రజాశక్తి - పార్వతీపురం

మూడేళ్ల క్రితం అందజేసిన 2జి సెల్ ఫోన్లతో ఆన్‌లైన్ పనులు చేయలేమని జిల్లాలోని అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం ప్రాజెక్టు కార్యాలయాల్లో సెల్ ఫోన్లను సరెండర్ చేశారు. జిల్లా కేంద్రంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలు సెల్ ఫోన్లను ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022లో పంపిణీ చేసిన సెల్ ఫోన్ లతో ఆన్ లైన్ పనులు చేయడం సాధ్యం కావడం లేదని, ఇప్పటికే అనేకసార్లు అధికారులకు తెలియజేశామని, కానీ ఫలితం కనిపించడం లేదని చెప్పారు. తాజా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 5జి సెల్ ఫోన్ లు పంపిణీ చేయాలని కోరామని తెలిపారు. అంగన్వాడీల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. మినీ అంగన్వాడీ కార్యకర్తలకు రూ.10వేలు వేతనం పెంచుతున్నామని చెప్పి వారికి సంక్షేమ పథకాలు అందకుండా చేయడం అన్యాయమని అన్నారు. ఈనెల 5నుంచి అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకలాపాలను రికార్డుల్లో నమోదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బలిజిపేట : సిడిపిఒ కార్యాలయంలో సెల్ ఫోన్లు అందజేత, ట్యాబ్ లు ఇవ్వాలనీ డిమాండ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి డిమాండ్ చేశారు. మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్ లేకపోవడంతో లబ్ధిదారులకు సంతకాలతో సరుకులు పంపిణీ చేసేలా పాత పద్ధతిని అవలంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.దాలమ్మ, సత్యవతి, శారద, లక్ష్మి, స్వర్ణ,, పార్వతి, స్వర్ణ సావిత్రి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేటలో కాలం చెల్లిన సెల్‌ఫోన్లను చూపుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కొమరాడ : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద అంగన్వాడీ కార్యకర్తలకు అందజేసిన నాణ్యతలేని మొబైల్ ఫోన్లను ఐసిడిఎస్ అధికారులకు తిరిగి అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షులు సిరికి అనురాధ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి అంగన్వాడి సెక్టరు లీడర్లు గౌరమ్మ, జ్యోతి తదితరులున్నారు.

కురుపాం : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిబ్బందికి అంగన్వాడీలు వాడుతున్న మొబైల్ ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ జిల్లా అధ్యక్షులు పి.సరళ కుమారి, కురుపాం ప్రాజెక్ట్ నాయకులు జె.సరోజ మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని ఎన్నోసార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాల అందించిన స్పందించకపోవడంతో తాము ఆన్లైన్ సేవలకు స్వస్తి పలికి అంగన్వాడి కేంద్రాల్లో జరుగుతున్న అన్ని కార్యక్రమాలును రికార్డు వర్క్ మాత్రమే నేటి నుంచి చేపడతామని అన్నారు. కార్యక్రమంలో మండలంలో గల అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : ప్రభుత్వం ఇచ్చిన మొబైల్ ఫోన్లన్నీ స్థానిక సిడిపిఒ కార్యాలయంలో అందజేశారు. మంగళవారం నుండి లబ్ధిదారులకు ఆహార సరుకులురికార్డుల ద్వారానే రాస్తామని, ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలనీ, కొత్తగా మాతృ వందనం పథకం అమలు చేయలేమని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. అనంతరం సిడిపిఒకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు గౌరీశ్వరి, మరియమ్మ, పుష్పలత, యశోద, కుమారి, నారాయణమ్మ, తిరుపతమ్మ, మాణిక్యమ్మ శశికళ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు కార్యకర్తలు పాల్గొన్నారు .

పాలకొండ : సెల్ ఫోన్లు మాకొద్దని సిడిపిఒ గీతాంజలికి కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా సెల్ ఫోన్లు తమకు ఎందుకన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులు హాజరు, సరుకుల వివరాలు, రికార్డులను నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు, యూనియన్ నాయకులు అమరవేణి, హిమప్రభ, జెస్సీ బాయి, మణికుమారి తదితరులు ఉన్నారు.

సీతంపేట : తల్లులకు, పిల్లలకు ఫేస్ యాప్ ద్వారా అప్లోడ్ చేయడం సిగ్నల్ లేక కష్టమవుతుందని కార్యకర్తలు, తల్లులు స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు సిగ్నల్ లేక చాలా వర్క్ ఇబ్బంది పడుతున్నామని సిగ్నల్ వద్దకే తల్లులకు పిల్లలకు తీసుకువెళ్లాలి పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం సిడిపిఒ సిమ్మలమ్మకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు పార్వతి, అంజలి, దర్శిమి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఏజెన్సీ ప్రాంతంలో సిగ్నల్స్ లేక సేవలందించలేని యాప్‌లు తమకు వద్దని భద్రగిరి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వర రావు, ఎంపిటిసి సభ్యులు మండంగి రమణ, అంగన్‌వాడీ నాయకులు కస్తూరి సత్యవతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంలో అంగన్‌వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఉమామహేశ్వరి; కురుపాంలో నిరసన తెలుపుతున్న యూనియన్ అధ్యక్షులు సరళకుమారి, కార్యకర్తలు

శతశాతం సంతృప్తి చెందాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలపై అర్జీదారుల సంతృప్తి స్థాయి పెరగాల్సి ఉందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. అర్జీదారుల సమస్యల పరిష్కార విషయమై ఐవిఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం చేసే సర్వేలో శత శాతం సంతృప్తికరంగా ఉన్నట్లు అర్జీదారుల స్పందన ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందుకు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అర్జీలు పెండింగ్ ఉన్నా, సంతృప్తికరంగా లేకపోయినా, ఐవిఆర్ఎస్‌లో శతశాతం సంతృప్తి చెందకపోయినా సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. వచ్చిన ప్రతి అర్జీని రిజిష్టర్లో నమోదు చేసి ఫైళ్లను నిర్వహించాలని అన్నారు. సోమవారం పీజీఆర్ఎస్, పీ4, పీఎం సూర్యఘర్, ఇపిటిఎస్ తదితర అంశాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పీఎం సూర్యఘర్ పై సమీక్షిస్తూ ప్రతి విద్యుత్‌శాఖ ఎఇ వారి పరిధిలో గల ఎస్సీ వినియోగదారుల ఇళ్లను ఎంపిడిఒలతో సందర్శించి సూర్యఘర్‌పై అవగాహన కల్పించి యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ వినియోగదారులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీని వివరించాలని తెలిపారు. ప్రతి అధికారి ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇపిటిఎస్ ద్వారా ప్రతి శాఖలోని రికార్డులు, జిఒలను స్కానింగ్ చేసి అప్లోడ్ చేయాలని చెప్పారు. పి-4పై కలెక్టర్ సమీక్షిస్తూ బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శుల ఎంపిక పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయాల వారీగా ఎన్ఆర్ఐలు, వ్యాపారవేత్తల వివరాలు తీసుకొని, వారితో బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ విషయంలో వారి సందేహాలను నివత్తి చేయాలని తెలిపారు. సమావేశంలో జెసి ఎస్.ఎస్.శోబిక, ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, ఎస్డీసీలు పి.ధర్మచంద్రా రెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, డిఇఒ బి.రాజకుమార్, డిఐఇఒ వై.నాగేశ్వరరావు, ఎస్ఎస్ఎ ఎపిసి ఆర్.తేజేశ్వరరావు, ఈపీడీసీఎల్ ఎస్ఈ కె.మల్లికార్జునరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డిఆర్ఒకు వినతి పత్రం అందజేస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు పరీక్షిత్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

ఎరువుల పంపిణీలో ప్రభుత్వం వైఫల్యం

కలెక్టర్‌కు వైసిపి నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లాలో ఎరువుల పంపిణీలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్తురాజు, మాజీ మంత్రి పుష్ప శ్రీవాణి, మాజీ ఎమ్మెల్యే జోగారావు ఆరోపించారు. సోమవారం వారు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ వరి నాట్లు వేసే పరిస్థితుల్లో రైతులకు ఎరువులు అందుబాటులో లేవన్నారు. బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి రాలేదని అన్నారు. చంద్రబాబు నాయుడు ఎప్పుడు సిఎంగా ఉన్నా రైతులకు కష్టాలేనని విమర్శించారు. ఖరీఫ్ సీజన్లో అవసరమైన ఎరువులు రైతులకు అందక తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్న నేపథ్యంలో టిడిపి కూటమి ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులను సరఫరా చేయడంలో విఫలమైందని విమర్శించారు. అందుబాటులో ఉన్న అరకొర ఎరువులను కూడా వారి పార్టీ వారికి ఇస్తున్న ఫలితంగా మిగతా రైతులంతా ఎరువుల కొరతను ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు అందించే ఎరువులు విషయంలో కూడా పార్టీ జెండాలు, రంగులు చూసి ఇవ్వడం దురదృష్టకరమని, కూటమి సిగ్గుమాలిన పాలనకు ఇంతకంటే నిదర్శనం ఇంకేముంటుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులకు అవసరమైన ఎరువులను అందజేసి దళారీ వ్యవస్థను అరికట్టి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఆందోళనలను చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాబుజి నాయుడు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు నగిరెడ్డి శరత్ బాబు, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, జడ్పిటిసి ప్రతినిధి బలగ నాగేశ్వరరావు ఎంపిపి ప్రతినిధి మజ్జి శేఖర్, వైస్ ఎంపిపి బంకురి రవికుమార్, సీనియర్ నాయకులు బాచీ, బంకుపల్లి వాసుదేవరావు, రెడ్డి రవి, సిరిపురపు ప్రకాష్, పెంట రమణ, పాత గౌరీ శంకర్, కురుపాం నియోజకవర్గ సీనియర్ నాయకులు, రైతు నాయకులు తదితరులు వెంట పాల్గొన్నారు.

దాడులు ఆపాలి : ఆర్ఎంపి వైద్యులు

ప్రజాశక్తి - పాలకొండ

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలందిస్తున్న తమపై దాడులు ఆపాలని ఆర్ఎంపి వైద్యులు కోరారు. సోమవారం స్థానిక తహశీల్దార్ రాధాకృష్ణమూర్తికి వినతిని అందించారు. వీరికి మద్దతుగా హాజరైన నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు, వైస్‌చైర్మన్ పల్లా ప్రతాప్, టీడీపీ నాయకుడు రుద్ర కోటేశ్వరరావు మాట్లాడుతూ తక్షణమే ప్రజలకు అందుబాటులో వైద్య సేవలందించిన వారు ఆర్ఎంపిలేనని వివరించారు. ఆపరేషన్ల అయ్యాక ఇంటి వద్ద ఉన్న రోగులకు అవసరమైన వైద్య సేవలందించింది ఆర్ ఎంపిలేనన్నారు. అయితే ఏ జిల్లాలో ఇలాంటి దాడులు జరగడం లేదని, మన్యం జిల్లాల్లోనే జరుగుతున్నాయని, దీనిపై మరో సారి పునఃపరిశీలన చేయాలని అన్నారు. ముఖ్యంగా ఆర్ఎంపిల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో రోగులు మేలు చేకూరుతుందన్నారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ జిల్లా యంత్రాంగం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తామన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి 138 అర్జీలను స్వీకరించగా, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హెమలత, కెఆర్ఆర్సీ ఎస్డిసి పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతి అర్జీకి అర్ధవంతమైన సమాధానం ఇస్తూ, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఆర్జీని ఆడిటింగ్ చేస్తారని, అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్ధ వంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షిస్తారన్నారు. అర్జీలు రీ-ఓపెన్ అయితే వాటికి కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లో అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలని, అలాగే వచ్చిన అర్జీలకు సరైన పరిష్కారం చూపుతూ, రీ ఓపెన్ కేసులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

పిజిఆర్ఎస్ అనంతరం ముగ్గురు వికలాంగులకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ట్రైసైకిళ్లను అందజేశారు. తాము నడవలేని పరిస్థితిలో ఉన్నామని, తమకు ట్రై సైకిళ్లను మంజూరు చేయాలని సాలూరు మండలం వెలగవలస గ్రామానికి చెందిన కొట్టిస సీతారాం, మజ్జి రాము, గరుగుబిల్లి మండలం గొట్టివలసకు చెందిన యోగిరెడ్డి అప్పలనాయుడు పిజిఆర్ఎస్‌లో కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన స్పందించి తక్షణమే ట్రైసైకిళ్లను పంపిణీ చేసి, తన మానవతా హదయాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో....

పార్వతీపురం టౌన్ : జిల్లాల ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి అన్నారు. సోమవారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో 13 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ సుధాకర్, ఎస్సై ఫ్రక్రుద్దిన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 36 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐటిడిఎలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు. మొత్తం 36 మంది వినతి పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు, ఇఇ కుమార్, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్రావు, ఉపాధి హామీ ఎపిడి శ్రీహరిరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, వెలుగు ఎపిడి సన్యాసిరావు, పిహెచ్ఒ గణేష్, ఎఎంఒ కోటిబాబు, ఎస్సై అమ్మానరావు, ఎఒ వై వాహిని, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్, ఐటిడిఎ పిఒ

అర్జీదారులకు ఉచిత భోజన సదుపాయం

పిజిఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారులకు ఉచిత భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ప్రతి సోమవారం పిజిఆర్ఎస్ కు ఎంతో మంది అర్జీదారులు వ్యయప్రయాసలకోర్చి చాలా దూరం నుంచి వస్తుంటారన్నారు. దాతల సహకారంతో ప్రతి సోమవారం సుమారు 500 మంది అర్జీదారులకు ఉచితంగా భోజనం సదుపాయాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ అర్జీదారుడు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో సబ్ కలెక్టరు అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

- యుద్ధానికి సిద్ధమైన మున్సిపల్ ఉద్యోగులు
- విచారణకు ఆదేశాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లుపై జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు మున్సిపల్ ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించడంతో ఉద్యోగులు కలెక్టర్‌కు వారు ఎదుర్కొంటున్న సమస్యల్ని వివరించారు. కమిషనర్ వ్యవహారం తన దృష్టిలో ఉందని, విచారణకు ఆదేశిస్తానని చెప్పారు. కమిషనర్ల కొరత కొంత వుందని, మున్సిపల్ పరిపాలన డైరెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విలేకరులతో మున్సిపల్ ఉద్యోగుల సంఘం నాయకులు ఈశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన తర్వాత కూడా కమిషనర్ వేధింపులు ఎక్కువయ్యాయని చెప్పారు. ఆయన వ్యవహారశైలిలో ఎలాంటి మార్పు లేదని చెప్పారు. ఎమెల్యేకీ వసూళ్లలో వాటా ఇవ్వాలని కమిషనర్ పదే పదే చెపుతున్నారని తెలిపారు. ఈ పోస్ట్ లోకి రావడానికి ఎమ్మెల్యే, ఉన్నతాధికారులకు లంచాలిచ్చానని చెప్పారని వివరించారు. మున్సిపల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వినయ్ కుమార్ ఆధ్వర్యాన ఉద్యోగులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన నిరసన

కలెక్టర్‌కు, అధికారులకు వినతి

ప్రజాశక్తి-పార్వతీపురం

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన పార్వతీపురం జిల్లా కేంద్రాలతోపాటు ఆయా జిల్లాల్లోని 7 మండల కేంద్రాల్లో జర్నలిస్టులు నిరసనలు తెలిపారు. అనంతరం అధికారులకు వినతులు అందజేశారు. పార్వతీరంలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జర్నలిస్ట్ డిమాండ్సడేగా పాటించాలంటూ ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపులో భాగంగా జర్నస్టులు నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కె.సింహాద్రి, పట్నాయక్, కెవి దుర్గారావు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చొవర చూపాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోవడం వల్ల జర్నలిస్టులకు భద్రత కొరవడుతోందని, బెదిరింపులు, వేధింపులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం కూడా ప్రభుత్వం ఆలోచించడం లేదన్నారు. ముఖ్యంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పెన్షన్ మంజూరు చేయాలని, మీడియా కమిటీ వేయాలని, కొత్త అక్రిడేషన్లు ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక ప్రచురణ పునరుద్ధరించాలని, సమాచారశాఖను బలోపేతం చేయాలని, జర్నలిస్టులకు రైలు ప్రయాణంలో రాయితీ కల్పించాలని, ఎసి బస్సుల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మీడియా అకాడమికీ గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత, కార్మిక బీమా సదుపాయం వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు రామకృష్ణ, శేఖర్, శ్రీను, సుధీర్, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రంతోపాటు కురుపాం, కొమరాడ, మక్కువ, సీతానగరం, పాలకొండ, సాలూరు^హశీలార్లకు వినతులు అందజేశారు.



కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ జరుగుతున్న ప్రచారంలో భాగంగా సోమవారం పట్టణంలోని మూడో వార్డు వివేకానంద కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బివి రమణ, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు పి సంఘం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి రంజిత్ కుమార్, సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ బి సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు సంచాన ఉమామహేశ్వరరావు, ఎం గౌరమ్మలి తదితరులు మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు వ్యతిరేకంగా మంగళవారం పార్వతీపురం జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ జిల్లా కార్యాలయం వద్ద వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని, ఈ ఆందోళనలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఏకలవ్య పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ పరిధి అనసభద్రలో గల ఏకలవ్య ఆదర్శ పాఠశాలను డిప్యూటీ ఎంపిడిఒ సూర్యనారాయణ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సౌకర్యాలు, ఇతర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలకు ప్రహరీ గోడ లేదని, విద్యార్థులకు సరైన క్రీడామైదానం లేదని గుర్తించారు. అలాగే పాఠశాల విద్యార్థులకు రక్షిత మంచినీరు, జనరేటర్ సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - కొమరాడ

ఈనెల 15నుంచి ఉచిత బస్సు అమలు చేస్తున్న నేపథ్యంలో ఆటో కార్మికులను అన్ని విధాలా ఆదుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు అనుబంధ సంఘం శ్రీ మజ్జి గౌరీ ఆటో యూనియన్ సమావేశం జరిగింది. సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు బి.గోపి, కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయడం చాలా శుభ పరిణామని అన్నారు. అదే దిశగా ఆటో కార్మికులను అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆటో రంగంలో ఉండే లక్షలాదిమంది యువత ఉపాధి లేకుండా రోడ్డున పడే ప్రమాదం ఉందని ప్రభుత్వం ప్రభుత్వానికి తెలిపారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

విజయరామరాజును అభినందిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, బేబినాయన

ఘనంగా శత్రుచర్ల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కురుపాం

మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు జన్మదిన వేడుకలను సోమవారం చినమేరంగిలో గల తన నివాసం వద్ద టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన పాల్గొని కేక్ కట్ చేసి విజయరామరాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణంపై శిక్షణ

ప్రజాశక్తి - పాలకొండ

మహిళా ప్రయాణికులకు ఉచిత బస్సు ప్రయాణంపై సోమవారం స్థానిక ఆర్‌టిసి డిపోలో జిల్లా డిపిటిఒ పట్నాల వెంకటేశ్వరరావు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఏ విధంగా మహిళలకు ఉచిత టికెట్ ఇవ్వాలన్న అంశాలన్ని దగ్గరుండి వివరించారు. కార్యక్రమం సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ బి.రమేష్, డిసి ఈశ్వరరావు, ఎన్ఎంయు కార్యదర్శి వి.రాజేష్ తదితరులున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

ప్రజాశక్తి - సీతానగరం

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు జరిమానా విధించినట్లు ఎస్సై ఎం రాజేష్ తెలిపారు అందించిన వివరాల మేరకు మండలంలో ఆరుగురు మద్యం తాగి డ్రై చేసిన వారికి డ్రంకెన్ డ్రై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరపరచగా కోర్టులో ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున జరిమానా విధించినట్టు తెలిపారు. అలాగే రెండోసారి డ్రంక అండ్ డ్రైవ్ కేసులు ఆ వ్యక్తిపై నమోదైతే జైల్ శిక్ష పడుతుందని హెచ్చరించారు

చలివేంద్రిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రిలో సోమవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, మధుమేహ, రక్తపోటు, జ్వర పీడితులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఓ శుభారతమని, ఎం ఎల్ హెచ్ పి, ఏఎన్ఎం, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిడిపిఒగా మంగమ్మ

ప్రజాశక్తి -సాలూరురూరల్

స్థానిక ఐసిడిఎస్ సిడిపిఒగా కె.మంగమ్మ నియమితులయ్యారు. ఈమె భోగాపురం మండలంలో సూపర్వైజర్‌గా పనిచేస్తూ ప్రమోషన్‌పై సాలూరు సిడిపిఒగా సోమవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌ఛార్జ్ సిడిపిఒగా పనిచేసిన విజయలక్ష్మి మక్కువ మండలం శంబర క్లస్టర్‌నకు సూపర్వైజర్‌గా బదిలీపై వెళ్లారు.

అభివృద్ధి దిశగా కోట దుర్గమ్మ ఆలయం

ప్రజాశక్తి - పాలకొండ

ఉత్తరాంధ్ర ఇలవేల్పుపైన కోటదుర్గ అమ్మవారి ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు ఆధ్వర్యంలో మన్యం పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి మన్మధరావు, ఆలయ ఇఒ సూర్యనారాయణ, ప్రధానార్చకులు దార్లపాడు లక్ష్మీ ప్రసాద్ శర్మ, సీనియర్ రాజకీయ నాయకులు పైడి కృష్ణప్రసాద్ సోమవారం సమావేశం అయ్యారు. కోటదుర్గ ఆలయానికి ఆనుకొని శిథిలావస్థ చేరిన పశు సంవర్ధక శాఖ కార్యాలయం ఆలయానికి అప్పగించాలని కొండలరావు కోరారు. ఈ ప్రాంతంలో ఆలయానికి ఆదాయం సమకూర్చేలా షాపులు నిర్మిస్తానని చెప్పారు. ఆలయానికి అది సమీపంలో వృథాగా ఉన్న కళాభారతి స్థలం కూడా ఇవ్వాలని కృష్ణప్రసాద్ ను కోరారు. దీనికి అంగీకరించడంతో ఆలయంలో పలు నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నారు.

అడ్డాపుశీలలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

మండలంలోని అడ్డాపుశీలలో సోమవారం సంచార ఉచిత వైద్యశిబిరాన్ని బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్డాపుశీల గ్రామంలో 104 సంచార వైద్య శిబిరం నిర్వహించి గర్భిణీలకు, వృద్ధులకు, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారికి అన్ని పరీక్షలు చేసి వారికి కావాల్సిన మందులిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ శ్రీకాంత్ రోగులకు సూచించారు. జ్వరాలు ప్రబలే అవకాశముండడంతో రక్త నమూనాలు సేకరించి పరీక్షలు కూడా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో ఫీవర్ సర్వే పక్కగా చేపట్టి, జ్వర లక్షణాలున్న వారిని త్వరగా గుర్తించాలని స్పష్టం చేశారు. మందుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. రోగుల తనిఖీలను ఆన్లైన్లో పొందుపరచాలని, అలాగే దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సలు కూడా నెలవారీ సక్రమంగా 104 వాహనాల్లో జరగాలని, అధిక రక్తపోటు, మధుమేహం తదితర మందులు రోగులకు సక్రమంగా పూర్తిస్థాయిలో అందాలని ఆదేశించారు. 104 సంచార వైద్య సిబ్బంది ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో 104 సిబ్బంది, వైద్యులు పాల్గొని రోగులకు ఉచిత సేవలు అందించారు.

12న డీ వార్మింగ్ డే : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈ నెల 12న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేయాలని అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పోస్టర్లను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు మందుల పంపిణీ జరగాలని సూచించారు. రక్తహీనత, నులిపురుగుల నివారణ ఆవశ్యకత ఉందని గుర్తించాలని అన్నారు. ఆల్ బెండజోల్ మాత్ర వేయడం ద్వారా రక్త హీనత నివారణ, పోషకాల గ్రహించడం జరుగుతుందని తద్వారా ఏకాగ్రత పెరుగుతుందనిపేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి మాత్రలను వేయించాలని, 12న మాత్రలు తీసుకోని పిల్లలకు 20న విడిగా అందించాలని ఆయన స్పష్టం చేశారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ జిల్లాలో 1,96,612 మంది బాల బాలికలు ఉన్నారని తెలిపారు. ఆల్ బెండజోల్ మాత్రలు ఇప్పటికే క్షేత్ర స్థాయికి పంపే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 1 నుండి 5 ఏళ్ల చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల్లోను, 6 నుండి 19 ఏళ్ల విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలలలో, నమోదు కాని, పాఠశాలలకు వెళ్లని పిల్లలు, కిశోర బాలికలకు అంగన్వాడీల్లో మాత్రలు అందజేస్తామని తెలిపారు. భోజనం అనంతరం మాత్రలు మింగించాలని ఆయన చెప్పారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ ఉండవని, మాత్రలు వేసిన అనంతరం ఎటువంటి అనారోగ్య లక్షణం కనిపించినా వైద్యాధికారులను, వైద్య సిబ్బందిని సంప్రదించాలని ఆయన సూచించారు.

అనంతరం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టరును సంబంధిత అధికారులతో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించాలని, దీనిపై అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఓ కె.హేమలత, కెఆర్ఆర్సి ఎస్డిసి పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్డిఎ పీడీ ఎం.సుధారాణి, డిఇఒ డాక్టర్ పి.జగన్మోహనరావు, సిడిపిఒ జి.శాంతిభవాని, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారం నుంచి రక్షణ కల్పించాలి

చలమవలస గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని డోకిశిల పంచాయతీ చలమవలస సమీపంలో ఉన్న కోళ్ల ఫారం నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యాన గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ చలమవలసకు 50 మీటర్ల దూరంలో రెడ్డి శివ అనే వ్యక్తి కోళ్లఫారం ఏర్పాటు చేశారని చెప్పారు. వేలాది కోళ్లతో ఫారం నడుపుతున్న కారణంగా దుర్వాసన భరించలేక పోతున్నారని చెప్పారు. ఈగలు వృద్ధి చెంది ప్రజల ఆహారం పై వాలుతున్నాయని, తద్వారా రోగాలబారిన పడుతున్నారని చెప్పారు. ఆసుపత్రులకు వెళ్లడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈగల వ్యాప్తి చెందకుండా, దుర్వాసన రాకుండా కోళ్ల ఫారం యజమాని ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. గ్రామానికి అతి సమీపంలో పెద్ద కోళ్లఫారం ఏర్పాటుకు జిల్లా అధికారులు అనుమతి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కోళ్లఫారం అనుమతి రద్దు చేసి రోగాల బారి నుంచి కాపాడాలని కృష్ణమూర్తి కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి

డిఇకు వినతిని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తోటపల్లి ఎడమ కాలువ ఆయకట్టుకు నీరిందించాలి

ఇరిగేషన్ కార్యాలయం ముందు ఆందోళన

ప్రజాశక్తి - పాలకొండ

తోటపల్లి ఎడమ కాలువ పరిధిలో ఉన్న ఆయకట్టుకు నీరిందించాలని కోరుతూ సోమవారం ఇరిగేషన్ కార్యాలయం ముందు రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు వారాడ సుమంత్ నాయుడు మాట్లాడుతూ రైతుల బాధలు అధికారులకు పట్టవా అంటూ ప్రశ్నించారు. తాను ఎప్పటి నుంచో ఇదే సమస్యను ఎదుర్కొంటున్నానని, అయినప్పటికీ పరిష్కారం జరగడం లేదన్నారు. సాగునీరు ఎప్పుడిస్తారంటూ నిలదీశారు. ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు మాట్లాడుతూ సాగునీరివ్వకపోతే క్రాఫ్ హాలీడే ప్రకటించాలన్నారు. సాగునీటి కోసం అనేక ఏళ్ల నుంచి ఏటా రైతులు ఆందోళన చేస్తున్నా పరిష్కారం కావడం లేదన్నారు. జూన్ 4న సబ్ కలెక్టర్ సమక్షంలో రైతు సంఘాలతో జాయింట్ సమావేశం జరిపారని, షట్టర్లు బాగు చేస్తామని, పూడిక తీతలు తీయిస్తామని, 32 మంది లస్కర్లను నియమిస్తామని, ఖరీఫ్ సీజన్‌కు సాగునీరందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినా నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. సాగునీరందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. శాశ్వత పరిష్కారం కోసం ఎపి రైతు సంఘం అన్ని గ్రామాల్లో పర్యటించి ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాయబారాలకు, వినతి పత్రాలకు పరిష్కారం చేసే రోజులు కావని, ఎడమ కాలువ ఆయకట్టు రైతులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు మాయ మాటలు చెప్పి రైతులను మోసగిస్తున్నారని విమర్శించారు. జూలై 16న తోటపల్లి నీరు విడుదల చేసినట్టు ప్రకటనలు చేసినప్పటికీ శివారు భూములకు చుక్క నీరందలేదన్నారు. సబ్ కలెక్టర్ ముందు ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చలేదన్నారు. రైతులంటే ఇంత నిర్లక్ష్యమేమిటని ప్రశ్నించారు. అనంతరం ఇరిగేషన్ డిఇఇ గన్ని రాజును కలిసి వినతి పత్రం అందించారు. మంగళవారం సాయంత్రంలోపు నీటిని విడుదల చేసి సాగు భూములకు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, ఎఎంసి వైస్ చైర్మన్ ముంజేటి త్రినాథరావు, లుంబూరు మాజీ ఉప సర్పంచ్ వావిలపల్లి రమణ, తదితరులున్నారు.

విద్యుత్ కనెక్షన్ల కోసం గిరిజన రైతుల ఫిర్యాదు

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యుత్ కనెక్షన్ కోసం మండలంలోని తోణాం పంచాయతీ పూతికవలస, దిగువమెండంగికి చెందిన గిరిజన రైతులు గత కొంతకాలంగా విద్యుత్ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించకపోవడంతో సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌కు హాజరయ్యారు. ఈ మేరకు ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ్‌కు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో పూతికవలస, దిగువమెండంగి గ్రామాలకు చెందిన 14మంది గిరిజన రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు కోసం దరఖాస్తు చేశారు. అప్పటి విద్యుత్ శాఖ అధికారులు కనెక్షన్ల కోసం రూ.17లక్షల 11వేల 281 అవుతుందని అంచనా వేశారు. దీంతో నిరుపేద గిరిజన రైతులు అంత సొమ్ము భరించలేరని భావించి వారు అప్పటి డిప్యూటీ సిఎం రాజన్నదొరను ఆశ్రయించారు. అంచనా మొత్తంలో 50శాతం సొమ్మును ఐటిడిఎ మంజూరు చేయాలని ఆయన లేఖ రాశారు. ఆ మేరకు ఐటిడిఎ పిఒ రూ.8.5లక్షలు మంజూరుకు ప్రతిపాదనలు పంపించారు. సిఎఫ్ఎంఎస్ ద్వారా నిధులు మంజూరు కావడంతో జాప్యం జరిగింది. ఆ నిధులు ఇటీవల నాలుగు నెలల క్రితం మంజూరయ్యాయి. ఈ విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అప్పటి ధ్రువ పత్రాలు కాలాతీతమైనందున పనికి రావని వారు గిరిజనులతో చెప్పారు. దీంతో గిరిజన రైతులు మళ్లీ కొత్తగా వ్యవసాయ కనెక్షన్లు కోసం ధ్రువపత్రాలు తయారు చేయించారు. విద్యుత్ అధికారులకు పత్రాలు అందజేసినా కనెక్షన్లు మంజూరుకు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వారు గ్రీవెన్స్ సెల్‌లో ఐటిడిఎ పిఒకు ఫిర్యాదు చేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

రాత్రిపూట విధులు రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - పార్వతీపురం

నిబంధనలకు విరుద్ధంగా రాత్రిపూట మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు విధులు అప్పగించడం వల్ల అనేక ప్రమాదాలకు గురవుతున్నారని, వీరికి కనీస ప్రమాద నివారణ చర్యలు మున్సిపల్ యంత్రాంగం చేపట్టడం లేదని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, కోశాధికారి జివి రమణ విమర్శించారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన చేపట్టి, అనంతరం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సాలూరు, పాలకొండ, బొబ్బిలి పట్టణాల్లో రాత్రిపూట పారిశుధ్య పనులు చేపట్టడం లేదని, కేవలం పార్వతీపురంలోనే ఈ విధానాన్ని ప్రవేశపెట్టడం కార్మికులకు తీవ్ర ఇబ్బందిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కార్మికులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, ఇది కేవలం అనాలోచితమైన పనులు కేటాయింపని, తక్షణమే రాత్రిపూట విధులను రద్దుచేసి యధావిధిగా పగటి పూట విధులను కార్మికులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఈ సమస్యపై మున్సిపల్ కార్మికులను ఐక్యం చేసి పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూరిబాబు, మున్సిపల్ యూనియన్ నాయకులు బి.బాల, భాను ప్రసాద్, మహేంద్ర, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

గిరిశిఖర గ్రామాలకు ఉపాధ్యాయులు రావడంలేదు

మండల సమావేశంలో సభ్యులు ఆరోపణ

ప్రజాశక్తి - సాలూరు రూరల్

గిరిశిఖర గ్రామాల్లో ప్రతి రోజు ఉపాధ్యాయులు రావడం లేదని, వీరిని ప్రతిరోజు పాఠశాలకు రప్పించి గిరిజన విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని పలువురు సభ్యులు కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల కో-ఆప్షన్ సభ్యులు జి.సువార్తరావు మాట్లాడుతూ గిరిశిఖర గ్రామాల్లో గిరిజన బిడ్డలు విద్యకు నోచుకోక దుర్భరమైన పరిస్థితి ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి రోజూ రావాల్సిన ఉపాధ్యాయులు చాలా గ్రామాలకు రావడం లేదని, దీనివల్ల విద్యార్థులు విద్యకు దూరమై పశువుల కాపరులుగా మారిపోతున్నారని అన్నారు. కావున సంబంధిత అధికారులు ఉపాధ్యాయులను ప్రతిరోజూ పాఠశాలకు వచ్చేలా చేయాలని ఎంఇఒ- 2 ఎన్ వెంకట్రావును కోరారు. దీనికి ఎంఇఒ మాట్లాడుతూ ప్రతిరోజు పాఠశాలకు ఉపాధ్యాయులు వెళ్లేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎరువులను సక్రమంగా ఇచ్చేలా వ్యవసాయ అధికారులు పనిచేయడం లేదని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ వ్యవసాయ అధికారిని కె.శిరీషను ప్రశ్నించారు. దీనికి సమాధానంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రాలు పిఎసిఎస్‌లు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా సుమారు 1200 మెట్రిక్ టన్నులు యూరియా డిఎపి ఈ సీజన్‌కు సంబంధించిన అన్ని రకాల ఎరువులను సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రోటోకాల్‌ను పాటించడం లేదని పారన్న వలస, పురోహితునివలస, జీగిరాం సర్పంచులు ఎంపిడిఒ జి.పార్వతిని ప్రశ్నించగా, ఆమె మాట్లాడుతూ సర్పంచ్, ఎంపిటిసిలకు ప్రతి అభివృద్ధి కార్యక్రమాల వివరాలు తెలియజేసి, వారిని ఆ కార్యక్రమాలకు ఆహ్వానించాల్సిందిగా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఎటువంటి పొరపాట్లు జరగకుండా చేస్తామన్నారు. ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని రైతులకు పిఎం కిసాన్ అన్నదాత సుఖీభవ కింద ప్రతి ఒక్కరికీ రూ.7000 చొప్పున విడుదల చేసిందని తెలిపారు. ఇంకా ఎవరికైనా రాకుంటే విఎఎలకు తెలిపి, ఈనెల 31లోపు గ్రీవెన్స్ పెట్టుకోవాలన్నారు. తహశీల్దార్ నీలకంఠరావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల్లో శాశ్వత నివాసం ఏర్పర్చుకున్న వారికి ప్రభుత్వం ఈ స్థలాలను క్రమబద్ధీకరిస్తుందని, రైతులకు సంబంధించిన ఏ విషయాలైనా స్థానిక రెవెన్యూ కార్యాలయానికి వచ్చి తెలియజేయాలని తెలిపారు. వైద్యాధికారి శివకుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిల్లోని ప్రసవాల్లో మండలం జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. ప్రతి ఆసుపత్రిలో ప్రభుత్వం సరిపడినని మలేరియాకు సంబంధించిన అన్ని రకాల మందులు సిద్ధంగా ఉన్నాయని ఏ ఒక్కరూ భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి జి.రాములమ్మ, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, పలువురు మండలశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

భోజన బియ్యాన్ని పాఠశాలల వద్దకు చేర్చాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - పార్వతీపురం

మధ్యాహ్న భోజన పథకం బియ్యాన్ని పాఠశాలల వద్దకు చేర్చాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు, జిల్లాప్రధాన కార్యదర్శి కె.భాస్కరావు డిమాండ్ చేశారు. కొన్ని మండలాల్లో ఈ బియ్యాన్ని మండలం మొత్తానికి 2, 3 చోట్ల ఉంచి అక్కడ నుండి ఉపాధ్యాయులను తీసుకువెళ్లమంటున్నారని, ఇది సరికాదని చెప్పారు. ఇలా ఉపాధ్యాయులను తీసుకువెళ్ళమంటే అది వారిపై ఆర్థికభారం పడడంతో పాటు పాఠశాలలో విద్యార్థుల చదువులకు నష్టం కలుగుతుందన్నారు. పాఠశాలలకు పాఠశాల వద్దకే బియ్యాన్ని సరఫరా అయ్యేలా చూడాలని వారు కోరారు. పాఠశాలల వద్దకు బియ్యం చేరని పక్షంలో ఉపాధ్యాయులు ఆ పనిని చేయలేరు కనుక వెంటనే జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జోక్యం చేసుకొని పూర్తిస్థాయిలో అన్ని పాఠశాలలకు పాఠశాల వద్దకు బియ్యం చేరేలా చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.

వ్యాధులకు నాటువైద్యం వద్దు

ప్రజాశక్తి - సాలూరురూరల్

సీజనల్‌గా వచ్చే డయేరియా, డెంగీ, మెదడు వాపు, చికెన్‌గున్యా వంటి వ్యాధులు, రోగాల పట్ల మూఢనమ్మకాలతో నాటు వైద్యాలు చేయించుకోకుండా స్థానికంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్యం చేసుకోవాలని నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు తెలిపారు. సోమవారం మండలంలోని కురుకుట్టి, దండిగాం, సారిక గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కళాబృందాల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తెలిసీ తెలియని వైద్యాన్ని ఎవరితోనూ చేయించుకోకూడదని, అలాగే సొంతంగా కూడా చేసుకోరాదని సూచించారు. దగ్గరలో నుండే ఆశా, ఎఎన్ఎం, వైద్యుల వద్ద మాత్రమే వైద్యం చేసుకోవాలని, తద్వారా వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని, మూఢనమ్మకాలతో గ్రామాల్లో ఎవరి వద్దా సొంత వైద్యం చేసుకోరాదని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కళా బృందాల ద్వారా గ్రామాల్లో సీజనల్‌గా సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నీడ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పనిచేసే చోట, చదువుకొనే చోట మహిళల పట్ల లైంగిక వేధింపులనకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివప్రసాద్ హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్ మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ స్వరూప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోష్ (ప్రెవేన్షన్ అఫ్ సెక్సువల్ హెరాస్మెంట్) కార్యక్రమంలో మాట్లాడారు. ఈవ్ టీజింగ్ పాల్పడితే కటకటాలు పాలవుతారని, క్షణికావేశంలో తప్పులు చేస్తే భవిష్యత్తు కోల్పోవల్సి ఉంటుందని విద్యార్థులకు సూచించారు. బాగా చదువు కొని మంచి భవిష్యత్తు పొందాలని కోరారు.

కుట్టు శిక్షణతో ఆర్థిక అభివృద్ధి

వైటిసి పరిసరాలు చూసి ఆగ్రహం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న కుట్టు శిక్షణతో ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వీలుంటుందని ఐటిడిఎ ఎపిఒ మురళీధర్ అన్నారు. ఆగస్టు 9న వైటిసిలో నిర్వహించనున్న ఆదివాసీ ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు పరిశీలనకు వచ్చిన ఆయన కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. మహిళలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైటిసి పరిసరాలను చూసి సిబ్బందిపై ఆగ్రహ వ్యక్తం చేశారు. గర్భిణీలుంటున్న వైటిసి ప్రాంగణంలో చెత్త, పాన్ పరాగ్, గుట్కా, ప్లాస్టిక్ సంచులు, మరుగుదొడ్లు చూసి వైటిసి సిబ్బందిపై మండి పడ్డారు. గిరిజన గర్భిణీలున్న ప్రాంతం ఇలాగే ఉంచుతారని ప్రశ్నించారు. ఎప్పటికప్పుడు పరిసరాలు శుభ్రం చేస్తూ ఆరోగ్యంగా ఉండేలా చూడాలని వారికి సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 9న ఆదివాసీ ఉత్సవాలు సందర్భంగా అధికారుల సూచనల మేరకు పరిసరాలను చూడడం జరిగిందని, దాదాపు 9వేల మంది ఈ కార్యక్రమానికి వచ్చే అవకాశం ఉందని, కావున వారికి భోజన వసతి సదుపాయాలు ఏర్పాటుపై పరిశీలించినట్టు తెలిపారు. ఉత్సవాలు ఎక్కడ ఏర్పాటు చేస్తారనేది ఇంకా స్పష్టత రాలేదన్నారు.

హామీలను అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం

తెలుగురైతు అధ్యక్షులు వెంకటనాయుడు

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్రం ఆర్థిక పరిస్థితుల్లో తల్లడిల్లుతున్న వేళ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం చాలా కష్టతరం విషయం అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాటను తప్పకుండా ఒక్కొక్క పథకం అమలు చేస్తుందని టిడిపి అరకు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు అన్నారు. మండలంలోని విక్రామపురంలో తన నివాసం వద్ద విలేకరులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ సమయంలో రాష్ట్రం ఆర్థికంగా అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రజలు అనేక అవస్థలు పడే ఇబ్బందులు పడిన పరిస్థితి గుర్తు చేశారు. ప్రజలను అభివృద్ధి, సంక్షేమం రెండు కన్నుల్లా కూటమి ప్రభుత్వం ప్రస్తుతం పాలన కొనసాగిస్తుందన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్‌లో భాగంగా ఒక్కొక్క పథకాన్ని అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందన్నారు. దీనిలో భాగంగా గత రెండు రోజుల క్రితం అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో అర్హులైన రైతులందరికీ రూ.7వేలు నగదు జమచేసి ఖరీఫ్ సీజన్‌కు పెట్టుబడి సహాయం కింద అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సమావేశంలో కురుపాం నియోజకవర్గం తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి గొట్టాపు త్రినాథం రైతులు తదితరులు ఉన్నారు.

పుట్టిన బిడ్డకు తల్లి పాలతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి కొమరాడ

పుట్టిన పసిపిల్లలకు తల్లిపాలతోనే ఆరోగ్యం సాధ్యమని ఐసిడిఎస్ సిడిపిఒ జి.సుగుణ కుమారి అన్నారు. మండలంలోని మాదలింగి సెక్టార్ పరిధిలోని కొట్టు, కెఆర్‌బి పురం సెక్టార్ పరిధిలోని కోటిపాం అంగనవాడి కేంద్రాల్లో తల్లిపాలు వారోత్సవ కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం వినియోగంపై వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వ అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు, ఆర్.లక్ష్మి, శారదాంబ సెక్టార్ యూనియన్ నాయకులు టి.రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు, రాజీ, మాధవి, చిన్న తల్లి, గుమ్మడ ఎంపిటిసి కె.పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

భామిని : పుట్టిన బిడ్డకు తల్లి అందించే పాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యాన్ని కలుగజేస్తుందని సిడిపిఒ శాంతి భవాని అన్నారు. మండలంలోని బత్తిలి, కేసర, గణసర గ్రామాల్లో ప్రపంచ తల్లి పాల వారోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల యొక్క ప్రాముఖ్యత గురించి వివరించి, కార్యక్రమంలో సూపర్వైజర్ జ్యోతిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి జగన్నాథం ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం : సంపూర్ణ పోషక విలువలు కలిగిన తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని మండలంలోని రేగిడి పి.హెచ్.సి వైద్యాధికారి డాక్టర్ ఆర్.ప్రదీప్ అన్నారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా భద్రగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని రేగిడి సెక్టార్ అంగన్వాడి ఉద్యోగులు, రేగిడి వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టిక ఆహారం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వరి, హెచ్ వి పెంటమ్మ, హెల్త్ సూపర్వైజర్ రవణ, పి రాధాకష్ణ, ఎ. ఎన్. ఎం లు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాలు వారోత్సవ కార్యక్రమంలో వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ గర్భిణీలకు, బాలింతలకు అవగాహన కల్పించారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డలు కూడా ఆరోగ్యంగా ఉంటారని, వైద్యులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. తల్లి ద్వారా వచ్చే పాలు బిడ్డకు ఆరోగ్యమన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు ఒ.శాంత కుమారి, సుభారతమని, ఆదిలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్ జె.జ్ఞానమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, పాల్గొన్నారు.

మహారాజశ్రీ బొబ్బిలి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

O.S.277/2023

Between:
Smt. Javvadi Roopavathi etc.....వాదులు
మరియు :-
Smt. Bhogi Chandrakala etc
......ప్రతివాదులు

To
D4 : శ్రీమతి కోట్ల ధనలక్ష్మి @ 44 W/o కోట్ల పారినాయుడు, Door No. 2-10, పెద్దవీధి, బగ్గందొరవలస, సీతానగరం మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.

మీరు కోర్టు నోటీసులు, అందుకోకుండా తిప్పి పంపిస్తూయున్నారు. కావున మీరు **తే 06-08-2025దీ**న పైన తెలిపిన కోర్టుకు స్వయంగా కాని, వకీలు ద్వారా గాని వచ్చి మీ ఆక్షేపణ తెలియజేయగలరు. లేనిచో మీ పరోక్షంగా అందుబాటులో ఉన్న ఆధారాలతో తీర్మాణం చేయబడును.

(By Order of the Court)
Amarapu Ramakrishna
Advocate,
Bobbili.